సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025




కొత్త ఎన్‌క్లోజర్‌లో 'నీల్‌గై'లు

ఇందిరాగాంధీ జూ పార్కులో మనుబోతుల (నీల్‌గై) ను రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న కొత్త ఎన్‌క్లోజర్లలోకి తరలించారు. 8లో



సిరులతల్లికి తులసీదళార్చన

విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. 8లో



పోటెత్తిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- తగ్గుతున్న చలిగాలులు



అరకులోయలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: జిల్లాలో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. చలిగాలుల ప్రభావం తగ్గినప్పటికీ పొగమంచు తీవ్రత అధికంగా ఉంది. పాడేరు, అరకులోయ, చింతపల్లితో పాటు జిల్లా అంతటా ఉదయం 9గంటలు దాటిన తరువాతే సూర్యోదయమవుతోంది. జి.మాడుగులలో 13.2 డిగ్రీలు, జీకే వీధిలో 13.2, చింతపల్లిలో 15, అరకులోయలో 15.6, డుంబ్రిగుడలో15.6, ముంచంగిపుట్టులో 15.6, పెదబయలులో 16.3, హుకుంపేటలో 16.3, అనంతగిరిలో 18.1, కొయ్యూరులో 19.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి.

రైతులకు అండగా ఉంటా

- చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి
- అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: రైతుల సమస్యలు పరిష్కరించి, వారికి అండగా ఉంటానని అరకు ఎంపీ గుమ్మ తనూజా రాణి తెలిపారు. లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని చెరుకుంపాకలు, కొత్తపాలెం, బొడ్డు మామిడి గ్రామాల రైతులు శ్రమదానంతో చేపట్టిన చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనూషదేవి, బోయిన కుమారి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యతో కలసి ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చెక్‌డ్యామ్‌కు ఎంపీ ల్యాడ్స్ నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. రైతులు నిర్మించిన చెక్‌డ్యామ్ మినీ రిజర్వాయర్‌ను తలపిస్తోందన్నారు. ఈ చెక్‌డ్యామ్ నిర్మాణానికి చిన్నపాటి తోడ్పాటు అందిస్తే మూడు గ్రామాలకు చెందిన వెయ్యి ఎకరాలకు పైగా బీడుగా ఉన్న భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉందని రైతులు ఎంపీకి తెలిపారు. లోతగెడ్డ మాజీ ఎంపీటీసీ పసుపులేటి అప్పన్నపడాల్, సాగిన శ్రీరాములు, నాయకులు యేసేపు, నడిపి పడాల్, కించే సతీష్, కిల్లో రామారావు, గుంట సమ్మో, వీరబాబు, సుందర్రావు, వీరన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చేరిన మరో ఇద్దరు కేజీబీవీ విద్యార్థినులు

వై.రామవరం(అడ్డతీగల): వై.రామవరం మండలం తోటకూరపాలెం కేజీబీవీలో చదువుతున్న మరో ఇద్దరు విద్యార్థినులు అనారోగ్యంతో శనివారం చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో చేరారు. పంపబోయిన యశస్విని లక్ష్మి జ్వరం,వాంతులు, పడాల శ్రీ హర్షిణి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ పీహెచ్‌సీలో చేరినట్టు వైద్యాధికారి నరేంద్ర తెలిపారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. కాగా 9 మంది విద్యార్థినులను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం పంపించినట్టు తెలిపారు.

పునాది స్థాయిలోనే మెరుగైన బోధన చేయాలి

- డీఈవో బ్రహ్మాజీరావు



శిక్షణ నమూనాలను పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

అరకులోయటౌన్: పిల్లలకు పునాది స్థాయిలోనే మెరుగైన బోధన చేయాలని డీఈవో బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని ఓ హోటల్‌లో నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు స్వామినాయుడు, మేఘమాలతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో భాస్కరరావు, ఎంఈవో భారతి రత్నం, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకన్న, కేఆర్‌పీ కొండమ్మ, ఎల్‌ఆర్‌జీ వనజాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏదీ స్వచ్ఛత...
ఎక్కడ సంపద?

దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. గత నెల 18న ఈ కార్యక్రమాన్ని గొప్పగా ప్రారంభించారు. తరువాత దానిని అటకెక్కించేశారు. అత్యంత పరిశుభ్రత మాట అటుంచితే కనీస స్థాయిలో కూడా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ జరగడం లేదు. జిల్లాలో పలు పల్లెలు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్వహణ పరమ చెత్తగా మారింది. చాలా చోట్ల అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి.



మినుములూరులో వర్మీ కంపోస్టు తయారీ లేని చెత్త సంపద కేంద్రం



సాక్షి,పాడేరు: జిల్లాలో పారిశుధ్యం పడకేసింది. గ్రామాల్లో ఎక్కడిపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అంటువ్యాధులు వ్యాపిస్తాయేమోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో ప్రతి మూడో శనివారం పారిశుధ్యకార్యక్రమాలు నిర్వహించాలని చేసిన ప్రకటన పత్రికలకే పరిమితమైంది. అధికారుల్లో చెత్త శుద్ధి లోపించడంతో గ్రామాలు మురికికూపాలుగా మారుతున్నాయి.

సంపద తయారీ ఎక్కడ ?

జిల్లాలో 430 పంచాయతీలుండగా 285 చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 68 పూర్తిగా, 147 పాక్షికంగా పనిచేస్తున్నాయని, 70 కేంద్రాలు పూర్తిగా పనిచేయడం లేదని అధికారులు ఆన్‌లైన్‌లో పేర్కొన్నారు. అధికారులు పనిచేస్తున్నాయని చెబుతున్న వాటిలో కూడా ఎక్కడా వర్మీకంపోస్టు తయారుకావడం లేదు.

ఎక్కడ చూసినా చెత్తే

ప్రతి ఇంటి నుంచి, వీధి నుంచి చెత్తను సేకరించి, దాని నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసి, స్థానిక రైతులకు తక్కువ ధరకు విక్రయించేలా గత ప్రభుత్వ హయాంలో ఏర్పాట్లు చేశారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 899 మంది క్లాప్ మిత్రలను, 430 చెత్త సేకరణ రిక్షాలను, మేజర్ పంచాయతీలైన రంపచోడం, డొంకరాయి, మోతుగూడెం, పాడేరు, చింతూరు, సీలేరు, చింతపల్లి, పద్మాపురం, పెదలబుడులకు ఒక్కోటి చొప్పున 9 మినీ వ్యాన్‌లు సమకూర్చారు. ఒక్కో సంపద కేంద్రం నిర్వహణకు రూ.3 లక్షల వరకూ ఖర్చు అవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చాలా కేంద్రాలు మూతపడ్డాయి. కొద్దిపాటి కేంద్రాలు నామ్‌కేవాస్తుగా పనిచేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో క్లాప్ మిత్రుల సరిగా పనిచేయడం లేదు. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణ ప్రక్రియ పూర్తిగా గాడి తప్పింది. స్వచ్ఛ భారత్,స్వచ్ఛ దివస్,ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ గురించి ప్రభుత్వం గొప్పగా ప్రకటనలు చేస్తున్నా గ్రామస్థాయిలో అమలుకావడం లేదు. పారిశుధ్య నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.జిల్లా కేంద్రం,నియోజకవర్గ కేంద్రం,మండల కేంద్రం,పంచాయతీ కేంద్రం ఇలా ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. పారిశుధ్య కార్యక్రమాలు నామమాత్రంగానే జరుగుతున్నాయి.

ప్రజల ఆరోగ్యానికి సెగ

చెత్తను సేకరించి, సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేయాల్సి ఉండగా చాలా గ్రామాల్లో రోడ్ల పక్కనే చెత్తకు నిప్పు పెడుతున్నారు. కొన్ని చోట్ల సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి అక్కడ నిప్పు పెడుతున్నారు. చెత్తలో అధిక శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉండడంతో అవి రోజుల తరబడి కాలుతూనే ఉంటున్నాయి. వీటి నుంచి విపరీతంగా పొగ వెలువడుతుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వాయుకాలుష్యం వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి.

జిల్లా కేంద్రంలోనూ అదే పరిస్థితి

జిల్లా కేంద్రం పాడేరులోని అన్ని వీధుల్లో సేకరిస్తున్న చెత్తను ఐటీడీఏ కార్యాలయం వెనుక ఉన్న బర్సింగి రోడ్డులోని చెత్త సంపద కేంద్రానికి పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజు వాహనాలతో తరలిస్తున్నారు. తడి,పొడి చెత్తను సేకరిస్తున్నప్పటికీ చెత్త సంపద కేంద్రానికి తీసుకువెళ్లి ప్రతి రోజు నిప్పంటిస్తున్నారు. విపరీతంగా పొగ వెలువడుతుండంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో రాకపోకలు సాగించే బరిసింగి,డోకులూరు పంచాయతీల గ్రామస్తులు ముక్కు మూసుకుని నడవాల్సిన పరిస్థితితో నరకం చూస్తున్నారు.

వినియోగంలోకి వచ్చేనా...

కూటమి ప్రభుత్వం చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రాలను ఎప్పుడు వినియోగంలోకి తీసుకువస్తుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇంటింటికీ వచ్చి చెత్తను సక్రమంగా సేకరించి, గ్రామాలను స్వచ్ఛంగా మార్చాలని కోరుతున్నారు.

మండలాలు	:	22
పంచాయతీలు	:	430
సచివాలయాలు	:	352
చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రాలు	:	285
పనిచేస్తున్నవి	:	68
పాక్షికంగా పనిచేస్తున్నవి	:	147
మూతపడినవి	:	70
క్లాప్ మిత్రులు	:	899
చెత్త తరలించే రిక్షాలు	:	430
మినీ వ్యాన్లు	:	09



పాడేరులో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం



పాడేరులో చెత్తకు నిప్పు పెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

ఆ దారిలో ప్రయాణం నరక ప్రాయం



పాడేరు పంచాయతీలో చెత్త సంపద కేంద్రం డంపింగ్ యార్డుగా మారింది.పాడేరు పట్టణంలో సేకరించిన చెత్తకు బరిసింగి వెళ్లేదారిలో రోడ్డు పక్కనే నిప్పు పెడుతున్నారు.ఈవ్యర్థాల నుంచి తీవ్రమైన దుర్గంధం వెలువడుతుండడంతో ఆ దారిలో ప్రయాణించేందుకు నరకయాతన పడుతున్నాం. చెత్తకు నిప్పు పెడుతుండడంతో పొగతో మరింత ఇబ్బందిగా ఉంది. డోకులూరు, బరిసింగికి ఇదే ప్రధాన రోడ్డు కావడంతో కాలినడకన వెళ్లేవారు,వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలి.

– కుర్రబోయిని సింహాచలం, సీఈవో,
గిరిజన యువ ప్రగతి స్వచ్ఛంద సంస్థ, డేగలవీధి,పాడేరు మండలం

వచ్చేనెల15 నాటికి వినియోగంలోకి..

జిల్లాలోని అన్ని చెత్త సంపద కేంద్రాలను మార్చి 15వతేదీ నాటికి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో తడి, పొడి చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించడమే లక్ష్యంగా అన్ని పంచాయతీల కార్యదర్శులు,ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. చెత్తకు నిప్పంచడంపై విచారణ జరుపుతాం.

– లవరాజు, జిల్లా పంచాయతీ అధికారి

గిరిజన ద్రోహి చంద్రబాబు

- 1/70 చట్టం రద్దుకు కుట్ర
- 11, 12 తేదీల్లో ఏజెన్సీని స్తంభింపజేస్తాం
- వైఎస్ జగన్ హయాంలోనే పారిశ్రామికాభివృద్ధి
- ఎమ్మెల్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు

సాక్షి, విశాఖపట్నం: గిరిజన ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబు గిరిజన ద్రోహి అని ఎమ్మెల్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవి బాబు అన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగ బద్ధంగా లభించిన 1/70 హక్కును టూరిజం పేరిట హరించేందుకు కుట్ర పన్నుతున్నారని, ఆ హక్కును కాపాడుకోవడానికి ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, ఆదివాసీ సంఘాలు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తామని తెలిపారు. 1/70పై స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలను మన రాష్ట్రంలోనే కాకుండా..దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో ఉన్న ఆదివాసీ బిడ్డలు, సంఘాలు తీవ్ర స్థాయిలో ఖండిస్తున్నట్టు చెప్పారు. విశాఖనగరంలోని మద్దిలపాలెంలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేస్తున్న తప్పులను, వైఫల్యాలను మా నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండగడుతున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబుకు, మంత్రులకు దమ్ముంటే మా నాయకుడు అడిగిన ప్రతి ప్రశ్నకు సరైన ఆధారాలతో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడం లేదని, దీనిపై పవన్‌కల్యాణ్ ఎందుకు ప్రశ్నించడంలేదన్నారు. పథకాలు అమలు చేయకపోతే ప్రశ్నించండని చెప్పిన చంద్రబాబు ఇప్పుడెందుకు ఆర్థిక పరిస్థితి బాగోలేదని సాకులు చెబుతున్నారని మండిపడ్డారు.

అవాకులు చవాకులు మాట్లాడితే గిరిజనులు తిరగబడతారు

గిరిజనుల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం పనిచేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అవాకులు,చవాకులు మాట్లాడితే గిరిజనులంతా తిరగబడతారని హెచ్చరించారు. గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజనుల సంక్షేమంపై దృష్టి సారించాల్సింది పోయి..గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం పనిచేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. ఆమె 1/70 కోసం పోరాడితే బాగుంటుందని తెలిపారు. లేదంటే గిరిజనులకు డిప్యూటీ సీఎం పదవి తీసుకురావడం కోసం పోరాడితే ఆదివాసీలు సంతోషిస్తారన్నారు. 2014–19లో కిలో కాఫీ గిట్టుబాటు ధర రూ.120 ఉంటే..దానిని రూ.327కు పెంచిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలల కావస్తున్నా.. ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. కాగ్ నివేదిక ప్రకారం రాష్ట్రాల వారీగా పారిశ్రామికాభివృద్ధిలో 2014–19లో ఏపీ 11 స్థానంలో ఉందని, వైఎస్సార్‌సీపీ హయాంలో 9 స్థానానికి ఎగబాకిందన్నారు. 2014–19 చంద్రబాబు హయాంలో రూ.13,860 కోట్లగా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం 2019–24లో వైఎస్ జగన్ హయాంలో రూ.15,632 కోట్లకు చేరిందని చెప్పారు. సోషల్ సెక్టార్‌లో 2014–19లో 2,437.47 కోట్లు ఉన్న ఆదాయం వైఎస్ జగన్ హయాంలో రూ.5,224.83 కోట్లకు పెరిగిందని చెప్పారు. 2014–19లో చంద్రబాబు హయాంలో 4.47 శాతంగా ఉన్న జీడీపీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 4.80కి పెరిగిందన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట–విజయవాడ సెక్షన పరిధిలో జరుగుతున్న నాన్–ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు, లోకమాన్య తిలక్ టెర్మినస్–విశాఖపట్నం(18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీ నుంచి 22వ తేదీ వరకు, టాటానగర్–యశ్వంత్‌పూర్(18111) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీన, యశ్వంత్‌పూర్–టాటానగర్(18112) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9, 16వ తేదీల్లో రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

షాలిమర్–హైదరాబాద్– షాలిమర్ (18045/46) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు మళ్లించబడిన మార్గంలో వయా సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తాయి.

- ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబాయి–భువనేశ్వర్–ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబాయి (11019/11020)కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మళ్లించబడిన మార్గంలో వయా వాడి, వికారాబాద్, సికింద్రాబాద్, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తాయి.
- షాలిమర్–సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19వ తేదీన మళ్లించబడిన మార్గంలో వయా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, సికంద్రాబాద్ మీదుగా నడుస్తుంది.

వందేభారత్ రీ షెడ్యూల్

ఈ నెల 19, 20వ తేదీల్లో ఉదయం 5.45 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం– సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా ఉదయం 7.15 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 19, 20వ తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్–విశాఖపట్నం(20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.15గంటలకు బయల్దేరుతుంది.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

- విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు దంతేవాడ నుండి బయల్దేరుతుంది.
- విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. ఈ తేదీల్లో ఈ రైళ్లు దంతేవాడ–కిరండూల్ మధ్య రాకపోకలు సాగించవు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి



నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్ బేరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్ బేరీ, కలెక్టర్ దినేష్‌కుమార్

నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్ బేరీ

సాక్షి,పాడేరు: రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని,నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్ బేరీ అన్నారు. జిల్లా కేంద్రం పాడేరులో శనివారం ఆయన తన బృందంతో పర్యటించారు.కలెక్టర్ దినేష్ కుమార్ పుష్పగుచ్చాలు అందజేసి, ఘన స్వాగతం పలికారు.కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలన్నారు. విద్య,వైద్యరంగాలతో పాటు అన్ని శాఖల పథకాలు గిరిజనులకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. మారేడుమిల్లి,గంగవరం,వై.రామవరం మండలాల్లోని గిరిజనులతో వర్చువల్‌గా మాట్లాడారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ, మాతాశిశువుల సంక్షేమం,వైద్య ఆరోగ్య సేవలపై సమీక్షించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యసేవలు, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల ప్రసవాలపై సమీక్షించారు. కలెక్టర్ దినేష్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మన్యం బంద్ పోస్టర్ల ఆవిష్కరణ



బంద్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స, డీఎల్‌వో ప్రతినిధి మాణిక్యం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

పాడేరు: టూరిజం అభివృద్ధికి 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70 చట్టాన్ని సడలించాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 11,12 తేదీల్లో చేపట్టనున్న 48 గంటల రాష్ట్రవ్యాప్త నిరవధిక మన్యం బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అధ్యక్షతన శనివారం పట్టణంలోని వీఆర్ ఫంక్షన్ హాల్‌లో అఖిల పక్ష నాయకులు బంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజుల బంద్‌లో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ, డీఎల్‌వో కేంద్ర ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్మోహన్‌రావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతాల నాగేశ్వరరావు, సీఐటీయూ కార్యదర్శి సుందరరావు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలికి లక్కు, ఆదివాసీ సేన ప్రతినిధి చుంచు రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కిల్లో ఊర్వశిరాణి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ అధ్యక్షురాలు పాచిపెంట శాంతకుమారి, అఖిలపక్ష నాయకులు కూడా సుబ్రహ్మణ్యం, వి.దాసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



శివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు

సాక్షి,పాడేరు: పట్టణంలోని పురాతన ఉమానీల కంఠేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24వతేదీ నుంచి 26వతేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లు,కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది కూడా మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ప్రచార పోస్టర్ ఆవిష్కరణలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ తమర్బ నరసింగరావు,సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి. వైస్ ఎంపీపీ శివకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాగులో పడి బీటెక్ విద్యార్థి మృతి



నాగ మల్లేశ్వరరావు మృతదేహం

మారేడుమిల్లి: గుంటూరు జిల్లా అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ద్వితీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న నాగులపాటి నాగమల్లేశ్వరరావు(19) అనే విద్యార్థి కొండ వాగులో పడి శనివారం మృతి చెందాడు. మండలంలోని పర్యాటక ప్రాంతమైన గుడిసె ప్రాంతాన్ని ఏడుగురు స్నేహితులతో కలిసి సందర్శించి, తిరుగు ప్రయాణంలో ఆకుమామిడికోట సమీపంలోని కాలకృత్యాలు కోసం సంగువ వాగులోకి దిగాడు. ఈ సమయంలో నాగమల్లేశ్వరరావు కాలుజారి వాగులో పడి మునిగి మృతి చెందాడు. స్నేహితులు, ఆకుమామిడి కోట గ్రామస్తులు, వేజువాడకు చెందిన కొంత మంది గిరిజనులు కలిసి వాగులో గాలింపు చర్యలు చేపట్టగా యువకుడి మృతదేహం లభ్యమైంది.దీనిపై మారేడుమిల్లి పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్టు ఎస్ఐ కె.సాధిక్ తెలిపారు.

పూలతలే...వంచిన విల్లులై..



- యోగాలో ప్రతిభా కుసుమాలు
- కఠోర శిక్షణతో సునాయాసంగా యోగాసనాలు
- పోటీలలో పతకాలు
- ఇటీవల గణతంత్ర వేడుకల్లో యోగా నృత్యంతో అద్భుత ప్రదర్శనలు
- కలెక్టర్, ఇతర ప్రముఖుల ప్రశంసలు
- అబ్బురపరుస్తున్న బేతపూడి కేజీబీవీ బాలికలు

దేవరాపల్లి: తీగ మల్లెలే ఎక్కుపెట్టిన విల్లులై...సుమబాలలే సంధించిన శరాలై...బాలురకు ఎందులోనూ తీసిపోమంటూ... కఠోర సాధనతో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకుంటున్నారు. యోగాను విజయసోపానంగా మలుచుకున్నారు. ప్రత్యేక శిక్షణతో యోగాలో అద్భుత ప్రదర్శనలు ఇస్తున్నారు. పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నారు బేతపూడి కస్తూర్బాగాంధీ విద్యాలయ బాలికలు.

దేవరాపల్లి మండలం బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులు యోగాలో రాణిస్తున్నారు. యోగాసనాల ప్రదర్శనలో బాలురకు తాము ఎక్కడా తీసిపోమంటూ పోటీల్లో ప్రతిభ చూపి అందరి మన్ననలు పొందుతున్నారు. విద్యార్థినులు చదువులకే పరిమితం కాకుండా వారిలో ఉండే ఆసక్తికు అనుగుణంగా స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ సిహెచ్.భువన మాధురి పర్యవేక్షణలో వ్యాయమ ఉపాధ్యాయురాలు జి.కుమారి యోగాపై తర్ఫీదునిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, యోగ సాధనకు ప్రాధాన్యం కల్పించడంతో ప్రస్తుతం సత్ఫలితాలిస్తున్నాయి. కఠోర శిక్షణలో కష్టతరమైన యోగసనాలను సైతం అవలీలగా వేస్తూ అబ్బురపరుస్తున్నారు. కేజీబీవీకి చెందిన పదో తరగతి విద్యార్థినులు కె.ఉమాదేవి, కె.రేవతి, జి.అనురాధ, వి.ఎమ్మిరోజ్, డి.రమ్య, కె.కీర్తన తదితరులు యోగాలో సత్తా చాటుతున్నారు.



గణతంత్ర దినోత్సవాల్లో ఆకట్టుకున్న విద్యార్థినుల యోగా ప్రదర్శన



యోగాసనాలను సాధన చేస్తున్న కేజీబీవీ బాలికలు

కష్టతరమైన కోకిలాసనం, గోపాలకృష్ణాసనం, గర్భాసనం, రాజకపోతాసనం, ద్విపాదాసనం, ద్వీపాసనం, ఓంకారాసనం, పూర్ణ నటరాజాసనం, వ్యాఘ్రాసనం, వృశ్చికాసనం, పూర్ణ మత్స్యేంద్ర ఆసనం, డింపాసనం తదితర ఆసనాలను సునాయాసంగా వేస్తు ఔరా అనిపిస్తున్నారు.

ప్రతిభకు గీటురాయి..

గత ఏడాది దేవరాపల్లిలో మండల స్థాయిలో జరిగిన యోగా పోటీల్లోను, చీడికాడలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన యోగా పోటీల్లో కేజీబీవీకి చెందిన ఆరుగురు విద్యార్థులు సత్తా చాటారు. గత ఏడాది పరవాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, మెడల్స్, మెమెంటోలను అందుకున్నారు.



యోగా పోటీల్లో సాధించిన పతకాలు, మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

కలెక్టర్ ప్రశంస...

రెండు నెలలు క్రితం స్థానిక కేజీబీవీని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలోనే విద్యాబోధనపై స్థానిక విద్యార్థులను ఆరా తీసి, స్థానిక విద్యార్థినులు యోగాలో రాణిస్తున్నట్టు తెలుసుకున్నారు. అనకాపల్లి జిల్లాలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో యోగసనాల ప్రదర్శన చేయాలని స్థానిక విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన యోగాసాలతో కూడిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయా విద్యార్థినులను జిల్లా కలెక్టర్ ప్రశంసించి, మెమెంటోను అందజేశారు.

ఆరోగ్య సోపానంలా...

యోగ, ధ్యానం శారీరక రుగ్మతలను దూరం చేస్తుంది. విద్యార్థులు యోగా సాధనతో ఏకాగ్రత, శారీరక, మానసిక ఉల్లాసం కలిగి ఉండేలా దోహదం చేస్తుంది. ఆరోగ్య సోపానంగా మారుతుంది.

ఏకాగ్రత రెట్టింపు



చదువుతో పాటు యోగాలో శిక్షణ పొందుతున్నాం. యోగా సాధన చేయడం ద్వారా మనసిక ప్రశాంత, ఏకాగ్రత రెట్టింపు అవుతుంది. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి యోగా పోటీలలో పాల్గొని ప్రతిభ చూపాం. పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందుకోవడం ఆనందంగా ఉంది. మరింత ఉన్నత స్థానంలో రాణించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాం.

– కె.ఉమాదేవి, పదో తరగతి విద్యార్థిని

అన్ని రంగాల్లో రాణించేలా తర్ఫీదు



విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించేలా తర్ఫీదు నిస్తున్నాం. సెపక్‌తక్రా, కబడ్డీ తదితర క్రీడలతో పాటు యోగాలో రాణిస్తున్నారు. యోగాసనాలలో రాణించడంపై జిల్లా కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ఇక్కడి విద్యార్థినులు భరతనాట్యం అద్భుతంగా ప్రదర్శిస్తారు. ఆర్ట్స్, క్రాఫ్ట్, అల్లికలు బాగా చేస్తారు.

– సీహెచ్.భువన మాధురి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, బేతపూడి

పార్టీ కోసం నమ్మకంగా పనిచేసే
ప్రతి ఒక్కరికీ గుర్తింపు



మండల పార్టీ అధ్యక్షులను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: పార్టీలో నమ్మకంగా పనిచేస్తే ప్రతీ ఒక్కరికి మంచి గుర్తింపు ఉంటుందని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని కొంతి గ్రామంలో ఆరు మండలాల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులను ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వారిని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికి గుర్తింపు వస్తుందన్నారు. నాయకులంతా సమష్టిగా పనిచేయాలని కోరారు. నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఆహారం కలుషితం కాలేదని చెప్పడం దారుణం'

రంపచోడవరం: వై.రామవరం మండలం తోట కూరపాలెం కేజీబీవీ పాఠశాలలో అస్వస్థతకు గురవుతున్న గిరిజన బాలికల ఆరోగ్యం పట్ల కలెక్టర్ శ్రద్ధ వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్ల వాణిశ్రీ , కమిటీ సభ్యుడు కంభం శాంతిరాజులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో బుధవారం ఉదయం పెట్టిన టిఫిన్, అదే రోజు రాత్రి పెట్టిన ఉడకని బీట్‌రూట్ కూర కారణంగా 14 మంది విద్యార్థినులు వాంతులు, విరోచనాలతో చవిటిదిబ్బల పీహెచ్‌సీలో చేరినట్లు తెలిపారు. ఫుడ్ పాయిజన్ కాలేదని కలెక్టర్‌కు ప్రకటించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కలెక్టర్ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు.గిరిజన బాలికల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్య ధోరణితో ఉండడం దారుణమన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.మెరుగైన వైద్యం అందించి గిరిజన బాలికల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

కేకే లైన్‌తో కూడిన వాల్తేరు డివిజన్ కొనసాగించాలి

సీపీఎం నేతల డిమాండ్

తాటిచెట్లపాలెం: కేకే లైన్, అరకుతో కూడిన వాల్తేర్ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా వామపక్షాలు, ప్రజాసంఘాలు, రైల్వే ఉద్యోగ సంఘాలు పోరాడుతున్నాయని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. విశాఖ కేంద్రంగా విశాఖపట్నం డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు తీసుకున్న కేంద్రం నిర్ణయాన్ని సీపీఎం జిల్లా కమిటీ స్వాగతిస్తోందని, కానీ కేకే లైన్‌తో కూడిన డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం విశాఖ రైల్వేస్టేషన్ వద్ద ఈమేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ కేకే లైన్, అరకుతో కూడిన వాల్తేర్ డివిజన్ మొత్తాన్ని నూతన విశాఖపట్నం డివిజన్‌లో కొనసాగించాలని, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డును విశాఖలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేకే లైన్‌లో సరకు రవాణా ద్వారా ఏడాదికి రూ.10,500 కోట్ల ఆదాయం ఆర్జిస్తోందని, ఇప్పుడు దీనిని రాయగడలో కలపడం వలన విశాఖకు నష్టమేనన్నారు. కేంద్ర నిర్ణయంతో అరకు అభివృద్ధి మొత్తం ఒడిశా చెప్పుచేతుల్లో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు వెంటనే జోక్యం చేసుకుని, యథావిధిగా కేకేలైన్ మొత్తం విశాఖ డివిజన్‌లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, ఉరుకూటి రాజు, ఎల్‌జే నాయుడు, యుఎస్ఎన్ రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాడేరు రూరల్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జేఏసీ రాష్ట్ర కో–చైర్మన్ కాంతారావు డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రం పాడేరులో శనివారం నిర్వహించిన సమగ్ర శిక్ష కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ శాఖల ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్లను ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు అనీల్, జయరాజ్, సీఐటీయూ నాయకులు ఉమామహేశ్వరరావు, చిట్టిబాబు, సింహాచలం, పుణ్యవతి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

కొత్త ఎన్‌క్లోజర్‌లో 'నీల్‌గై'లు

ఆరిలోవ(విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కులో మనుబోతులు (నీల్‌గై) సందర్శకులను అలరిస్తున్నాయి. ఇంతవరకు మారుమూలలో ఉండే వీటిని అధికారులు రోడ్డు పక్కన ఖాళీగా ఉండే ఎన్‌క్లోజర్లలోకి తరలించారు. విశాలమైన ఈ ఎన్‌క్లోజర్ జూ లోపల రహదారిని ఆనుకుని ఉండటంతో సందర్శకులకు ఇప్పుడు ఇవి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవి వాటి ఎన్‌క్లోజర్‌లో తిరుగుతూ సందడి చేస్తున్నాయి. చూడడానికి గాడిద ఆకారంలో కనిపించే ఈ నీల్‌గై పెద్ద జింక జాతికి చెందినది. వీటిని బూడిద జింక అని పిలుస్తారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద జింక జాతి. ఇవి పగటి పూట హుషారుగా సంచరిస్తాయి. వీటి ఆహారం పచ్చి గడ్డి. ఈ నీల్‌గై పొడవైన మెడ, పదునైన పొట్టి కొమ్ములతో ఆకట్టుకుంటుంది. జూలో ప్రస్తుతం 9 మనుబోతులు(నీల్‌గై) ఉన్నాయి. వాటిలో మూడు జతలు పెద్దవి, కాగా మూడు పిల్లలున్నాయి. జూలో వీటి ఎన్‌క్లోజర్.. సాంబార్ (కనుజులు) ఎన్‌క్లోజరు ఎదురుగా రోడ్డుకు కొంత దూరంలో కొన్ని సంవత్సరాలుగా ఉంది. ఇవి సందర్శకులకు సరిగ్గా కనిపించడం లేదు. ఇటీవల దాని ఎదురుగా జూ లోపల రహదారి పక్కన ఖాళీగా ఉన్న మరో ఎన్‌క్లోజర్‌లోకి అధికారులు ఒక జత మనుబోతులతో పాటు రెండు పిల్లల్ని తరలించారు. ఆ పిల్లలు తల్లి మనుబోతుతో కలసి ఎన్‌క్లోజర్‌లో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి.



జూలోని ఎన్‌క్లోజర్‌లో మనుబోతులు

సిరులతల్లికి తులసీ దళార్చన

డాబాగార్డెన్స్(విశాఖ) : నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో నగదు చెల్లించవచ్చు.

అజ్మీర్‌లో ఎన్‌వోఐడబ్ల్యూ త్రైవార్షిక సదస్సు

అనకాపల్లిటౌన్ : నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ అఖిల భారత 19వ త్రైవార్షిక సదస్సు ఈ నెల 9,10 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్‌లో జరుగుతుందని కేంద్ర కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పల నర్సయ్య శనివారం ప్రతికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. భారతీయ బీమా సంస్థలో 1969వ సంవత్సరంలో నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ ఆర్గనైజేషన్‌ను ప్రారంభించామని, కార్మికుల సమస్యలు, బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రభుత్వం ప్రోత్సహించడాన్ని వ్యతిరేకించడం, సంస్థలో కొత్తగా చేరిన వారికి పాత పింఛను సదుపాయం కల్పించాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తదితర డిమాండ్లను సదస్సులో చర్చిస్తామని తెలిపారు.

మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు



తీరంలో జాతర జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో ఈ నెల 12 జరగబోయే మాఘపౌర్ణమి జాతరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశించారు. తీరంలో జాతర జరిగే ప్రదేశాన్ని శనివారం డీఎస్పీ సందర్శించారు. లక్షకు పైగా భక్తులు వచ్చే అంచనా ఉన్నందున్న ట్రాఫిక్ క్లియరెన్స్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.వచ్చిన ప్రతి ఒక్కరూ తీరంలో స్నానాలు ఆచరిస్తారు కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోపలకి వెళ్లకుండా అప్రమత్తం చేస్తూ గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే జేబుదొంగలపై నిఘా పెట్టాలన్నారు. ప్రయివేటు వాహనాలను అడ్డురోడ్డు పరిధిలో నుంచి అనుమతించరాదని తెలిపారు. అన్ని ప్రాంతాలవారికీ ఆర్టీసీ బస్సు సర్వీసులు అందేలా సమన్వయం చేయాలన్నారు.